క్లుప్తంగా

రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్, రఘునాథపల్లి విద్యుత్‌సబ్‌స్టేషన్లలో అత్యవసర మరమ్మతు పనుల దృష్ట్యా స్టేషన్‌ఘన్‌పూర్, చిల్పూరు, జఫర్‌గఢ్ మండలాల్లో ఈనెల 23న(సోమవారం) ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఎన్‌పీడీసీఎల్ డీఈ రాంబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అయితే ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా గృహ విద్యుత్ వినియోగదారులకు విద్యుత్ సరఫరా చేసేలా చర్యలు చేపడతామన్నారు. విద్యుత్ సరఫరా అంతరాయం విషయమై ప్రధానంగా రైతులు, ఇతర విద్యుత్ వినియోగదారులు గమనించి విద్యుత్ సిబ్బందితో సహకరించాలని ఆయన కోరారు.

బాల్యమిత్రుడికి చేయూత



దేవరుప్పుల: మండలంలోని కామారెడ్డి గూడెనికి చెందిన మరిపెల్లి యాకయ్య రోడ్డు ప్రమాదంలో మరణించగా బాల్యమిత్రులు బాధిత కుటుంబానికి రూ.32 వేల ఆర్థిక సాయం అందించి అండగా నిలిచారు. కార్యక్రమంలో 1993–94 దేవరుప్పుల హైస్కూల్ బ్యాచ్ మిత్రులు వనమాల సతీష్, బుక్క శ్రీధర్, యామ సంతోష్, తీగల శ్రీనివాస్, బీరయ్య, వెంకన్న, చిన్న యాకయ్య, బబ్బూరి రవి, యాదగిరి, లక్ష్మయ్య, తదితరులు ఉన్నారు. అలాగే కామారెడ్డి గూడెం గ్రామంలో ఇటీవల మృతిచెందిన మరిపెల్లి యాకన్న. మరిపెల్లి సత్తయ్య చిత్రపటాలకు నాయీబ్రాహ్మణ సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పూలమాలవేసి నివాళులర్పించారు.

పేదల సంక్షేమమే ధ్యేయం



బచ్చన్నపేట: పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. మండలంలోని లింగంపల్లి గ్రామానికి చెందిన గర్నెపల్లి ఐలయ్యకు మంజూరైన రూ. 60వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును ప్రతాప్‌రెడ్డి శనివారం అందజేసి మాట్లాడారు. పార్టీ అధ్యక్షుడు బాల్‌రెడ్డి, భాగ్యలక్ష్మి, హరీష్, జంగిటి విద్యానాథ్, బాల్‌రాజు, వెంకట్‌గౌడ్ పాల్గొన్నారు.

ఫుడ్ ఫెస్టివల్



పాలకుర్తి: మండలంలోని వావిలాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్‌ను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పోషకాహార పదార్థాలను తయారు చేసి ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులకు వడ్డించారు. కార్యక్రమంలో ఎంఈఓ, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్థల పరిశీలన



బచ్చన్నపేట: మండలంలోని సాల్వాపూర్‌లో విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు కోసం ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించినట్లు తహసీల్దార్ ప్రకాశ్‌రావు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ సాల్వాపూర్ గ్రామానికి నూతన విద్యుత్ సబ్ స్టేషన్ మంజూరు అయినందున గ్రామంలోని ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించామని, కానీ ఆ స్థలం అటవీశాఖ పరిధిలో ఉన్నందున ఆ శాఖ అధికారులను కలిసి మాట్లాడటం జరిగిందన్నారు. త్వరలోనే ఆ స్థలంపై ఒక నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపారు. ఫారెస్ట్ అధికారి రమేష్, ట్రాన్స్‌కో ఏఈ సతీష్, ఏఆర్‌ఐ మున్వర్, నాయకులు బండికింది హరిబాబు, వెంకట్ పాల్గొన్నారు.

ప్రముఖ వ్యాపారి నాగభూషణం మృతి



జనగామ రూరల్: పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారి రేణిగుంట నాగభూషణం అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ మున్సిపల్ చైరపర్సన్ గాడిపల్లి ప్రేమలత, ప్రముఖులు నాఘభూషణం మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. కాగా, కుటుంబసభ్యులు అమెరికా నుంచి బయలుదేరని అంత్యక్రియలు ఆదివారం జరుగుతాయని కుమారుడు లయన్ కృష్ణ తెలిపారు. సంతాపం తెలిపిన వారిలో పూర్వ లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ కన్న పరుశరాములు, నాగబండి రవీందర్, అల్లాడి ప్రభాకర్, మహేశ్వర్, లక్ష్మి, నర్సయ్య, వెంకటమల్లారెడ్డి ఉన్నారు.

బస్టాండ్ చౌరస్తాలోని ఉంద్రుపుర బాప్టిస్ట్ చర్చి



హనుమకొండ రోడ్డులోని కేథలిక్ చర్చి



విద్యుత్ దీపాల వెలుగుల్లో ప్రార్థనా మందిరాలు



సెయింట్ పాల్ స్కూల్ వద్ద యేసుప్రభు, స్టార్



దయానిలయం వద్ద ఏర్పాటు చేసిన స్టార్

క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని ప్రార్థనా మందిరాలు(చర్చిలు) విద్యుత్ దీపాల వెలుగులో దేదీప్యమానంగా వెలుగొందుతున్నాయి. చర్చిలకు విద్యుత్ దీపాలతో అలంకరించి స్టార్లు, ట్రీలను ఏర్పాటు చేశారు. చర్చిల్లో ప్రతి రోజూ యేసు ఆరాధనలో ప్రార్థనలు చేస్తున్నారు.

– జనగామ



ధర్మకంచలోని బేతేలు బాప్టిస్ట్ సంఘం చర్చి

బాల్యం అంటేనే మధుర స్మృతి

● ఎంపీ కడియం కావ్య

జఫర్‌గఢ్: బాల్యం అంటేనే మధుర స్మృతి అని, అలాంటి బాల్యాన్ని గుర్తు చేసే వేడుకలు నిర్వహించడం అభినందనీయమని వరంగల్ ఎంపీ కడియం కావ్య అన్నారు. మండలంలోని కూనూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉన్నత, ప్రాథమిక పాఠశాల 50 సంవత్సరాల గోల్డెన్ జూబ్లీ వేడుకలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిలుగా ఎంపీ కడియం కావ్యతో పాటు పాఠశాల పూర్వ విద్యార్థులు మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్, ప్రముఖ కాంట్రాక్టర్ గంగిడి వెంకట్‌రెడ్డి హాజరయ్యారు. రెండు రోజుల పాటు నిర్వహించనున్న ఈ వేడుకలను తొలుత ఎంపీ కడియం కావ్య జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం కమిటీ కన్వీనర్ నాగముళ్ల ఆశోక్ అధ్యక్షత ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీ కావ్య మాట్లాడారు. మనకు చదువు, సంస్కారం, జ్ఞానాన్ని నేర్పిన పాఠశాలకు తిరిగి ఏదో ఒక రకంగా సహాయం చేయాలన్నారు. మాజీ ఎమ్మెల్యే రమేశ్ మాట్లాడుతూ ఈ వేడుకల ద్వారా చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తుకు వస్తున్నాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు పూర్వ విద్యార్థులను ఎంతగానో ఆకట్టుకున్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ లావణ్య శిరీష్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ తీగల కర్ణాకర్‌రావు, నిర్వాహకులు పిట్ట రాజు, గుండు రవి, అమరోజు శ్రీనివాస్, ప్రమోద్‌రెడ్డి, కుమారస్వామి, వాసుదేవరావు, లక్ష్మారెడ్డి పాల్గొనారు.



జఫర్‌గఢ్ జ్యోతి ప్రజ్వలన చేసి గోల్డెన్ జూబ్లీ వేడుకలను ప్రారంభిస్తున్న ఎంపీ కావ్య

‘క్రైస్తవులపై దాడులకు పాల్పడుతున్న బీజేపీ ప్రభుత్వం’

స్టేషన్‌ఘన్‌పూర్: దేశంలో బీజేపీ ప్రభుత్వం మత విద్వేషాలను రెచ్చగొడుతూ క్రైస్తవులపై దాడులకు పాల్పడుతుందని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించే మినీ క్రిస్మస్ వేడుకల్లో భాగంగా మండలంలోని శివునిపల్లిలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో శనివారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడారు. అనంతరం అధికారులు, పాస్టర్లతో కలిసి ఎంపీ క్రిస్మస్ కేక్ కట్ చేయగా స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం క్రిస్టియన్ మతపెద్దలు, అధికారులతో కలిసి ఎంపీ భోజనం చేశారు. ఆర్డీఓ డీఎస్ వెంకన్న, జిల్లా సంక్షేమ అధికారి రవీందర్, ఘన్‌పూర్ ఏఎంసీ చైర్మన్ జూలుకుంట్ల లావణ్యశిరీష్‌రెడ్డి, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఆర్‌ఐలు శ్రీకాంత్, సతీష్, క్రిస్టియన్ మత పెద్దలు బాలస్వామి, దేవవరం, థామస్, కోర్నెల్, కాలేబు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి



బచ్చన్నపేట: మాట్లాడుతున్న ఎంఈఓ వెంకట్‌రెడ్డి

● ఎంఈఓ వెంకట్‌రెడ్డి

బచ్చన్నపేట: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంఈఓ వెంకట్‌రెడ్డి సూచించారు. శనివారం మండలంలోని ఆలింపూర్ గ్రామంలోని పాఠశాలలో నిర్వహించిన పేరెంట్స్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు శ్రద్ధగా చదివేలా తల్లిదండ్రులు చూడాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ విజయలక్ష్మి, హెచ్‌ఎం స్వర్ణతార, మాజీ సర్పంచ్ బాల్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ మసూద్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యతోనే సమాజంలో గుర్తింపు

కొడకండ్ల: విద్యతోనే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని, విద్యార్థులు భవిష్యత్ లక్ష్యాన్ని నిర్దేశించుకుని శ్రద్ధగా చదువుకుని ఉన్నత ఖ్యాతిని గడించాలని ట్రెయినీ ఎస్సై బొడ్డు స్వాతి కోరారు. శనివారం మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పేరేంట్స్, టీచర్స్ సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మాదకద్రవ్యాలకు బానిసలుగా మారి జీవితాన్ని నాశనం చేసుకోవద్దన్నారు. కష్టపడి చదువుకుని విద్య నేర్పిన గురువులకు, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని సూచించారు. మండలంలోని రామవరం గ్రామానికి చెందిన ఆమె పట్టుదలతో ముందడుగు వేసి ఎస్సైగా ఎంపికవడం పట్ల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు సన్మానించారు. ఇన్‌చార్జ్ హెచ్‌ఎం వెంకటాద్రి, ఉపాధ్యాయులు చంద్రమౌళి, కిష్టయ్య, సత్యనారాయణ, వెంకన్న, రాములు, మానక, మొయిజుద్దీన్, రాజేందర్, మల్లేశ్వర్ పాల్గొన్నారు.

క్రీడల్లో క్రీస్తుజ్యోతి విద్యార్థుల ప్రతిభ

జనగామ రూరల్: ఐహెచ్‌ఎస్ మైత్రిదర్శన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో యశ్వంతపూర్‌లోని క్రీస్తుజ్యోతి ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం కబడ్డీ, ఖోఖో, షార్ట్‌పుట్, రన్నింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో క్రీస్తుజ్యోతి విద్యార్థులు ప్రతిభ చాటి మొదటి, రెండో స్థానంలో నిలిచిన షీల్డులు, ప్రశంసపత్రాలను అందుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్, డైరెక్టర్ ఫాదర్ డి.విజయపాల్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ అభినందించారు.



షీల్డులు అందజేస్తున్న విజయపాల్‌రెడ్డి

పేదలకు ‘బాలయేసు’ విద్యార్థుల బాసట

దేవరుప్పుల : మండల కేంద్రానికి చెందిన బాలయేసు ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు క్రిస్మస్ పర్వదినం పురస్కరించుకుని నిరుపేదలకు నిత్యావసర సరుకులు, దుస్తులు, చలి దుప్పట్లు పంపిణీ చేసి బాసటగా నిలిచారు. శనివారం బాలయేసు విద్యార్థులు విరాళాల రూపంలో సేకరించిన రూ.3 లక్షల 29 వేలతో మండల కేంద్రంతో పాటు గుండాల, పాలకుర్తి, కొడకండ్ల మండలాలకు చెందిన పలు గ్రామాల్లోని నిరుపేద, అనాథ, వృద్ధులకు బియ్యం, పప్పు, బ్లాంకెట్లు, దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రజలకు క్రిస్మస్ కిట్లు అందచేయడంతో పాటు శుభాకాంక్షలు తెలిపారు. కాగా, పాఠశాల కరస్పాండెంట్ బ్రదర్ జేసురాజు మాట్లాడుతూ విద్యార్థుల సేవా గుణాన్ని అభినందిస్తూ, దాతృత్వంతో అందరికీ ఆదర్శంగా నిలవడంపై అభినందనలు తెలిపారు.




పేదలకు సరుకులు పంపిణీ చేస్తున్న విద్యార్థులు

‘అమిత్ షాను మంత్రి పదవినుంచి తొలగించాలి’

జనగామ రూరల్/రఘునాథపల్లి/బచ్చన్నపేట/పాలకుర్తి టౌన్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్ షాను మంత్రి పదవి నుంచి తొలిగించాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొట్ల శేఖర్, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు ఇర్రి అహల్య డిమాండ్ చేశారు. కేవీపీఎస్, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో అమిత్ షా దిష్టిబొమ్మను శనివారం దహనం చేశారు. ఈ సందర్భంగా అమిత్ షాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎదునూరి మదార్, బాల్నె వెంకటమల్లయ్య, అజ్మీరా సురేష్‌నాయక్, కన్నారపు పరశురాములు, తూటి దేవాదానం, లలిత, ఎండి హతియా సుల్తానా, బొట్ల శ్రవణ్‌కుమార్ పాల్గొన్నారు. అలాగే రఘునాథపల్లి, బచ్చన్నపేట, పాలకుర్తి మండల కేంద్రాల్లో ఎస్‌ఎఫ్‌ఐ, సీపీఎం ఆధ్వర్యంలో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా దిష్టి బొమ్మలను దహనం చేశారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు పొదల నాగరాజు, మహేందర్, సోమన్న, కడారి ఐలయ్య, సాంబరాజు, అంజయ్య, బెల్లంకొండ వెంకటేష్, సోమ సత్యం, మాసంపల్లి నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

చిల్పూరు: చిన్నపెండ్యాలలో బహుమతులు అందుకున్న విద్యార్థులతో హెచ్‌ఎం సంపత్



ఘనంగా గణిత దినోత్సవం

తరిగొప్పుల/చిల్పూరు/నర్మెట/దేవరుప్పుల: గణిత శాస్త్ర పితామహుడు శ్రీనివాస రామానుజన్ జన్మదినాన్ని పురస్కరించుకుని జాతీయ గణిత దినోత్సవాన్ని జిల్లా వ్యాప్తంగా శనివారం ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు గణిత కృత్యాలు, ఆటపాటలు, నృత్యాలతో ఆనందంగా గడిపారు. కార్యక్రమాల్లో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



తరిగొప్పుల: నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



నర్మెట: మోడల్ స్కూల్‌లో..

ఘనంగా జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు



నర్మెట: ఏపీ మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను శనివారం మండలంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ జిల్లా నాయకుడు గోపగోని శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు, అభిమానులు కేక్ కట్‌చేసి పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పులి శ్రీకాంత్, పులి శ్రీధర్, నర్సింహనాయక్, సంతోష్ గౌడ్, నర్సింహులు గౌడ్, సురేష్, కె.సంతోష్, జాటోత్ బీక్యా నాయక్, గోపగోని యాదగిరి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష ప్యాడ్ల పంపిణీ..



బచ్చన్నపేట: ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలను మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకుడు బొడ్డు ప్రవీణ్‌కుమార్ కేక్ కట్ చేసి స్వీట్లను పంపిణీ చేశారు. అలాగే ఇటుకాలపల్లి సెకండరీ పాఠశాల విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.

పార్టీ బలోపేతానికి కృషి

జనగామ రూరల్: ప్రతి కార్యకర్త బీజేపీ బలోపేతానికి కృషి చేయాలని మండల అధ్యక్షుడు లద్దునూరి మహేష్ అన్నారు. శనివారం మండలంలోని ఓబుల్ కేశవపూర్ గ్రామంలో పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా బూతు కమిటీలు వేశారు. 204 బూత్ అధ్యక్షుడిగా మిట్ట రాములు, 205 బూత్ అధ్యక్షుడిగా మాచర్ల సిద్దులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కొంతం శ్రీనివాస్, చింతకింది సంతోష్, ఈర్ల నవీన్ తదితరులు పాల్గొన్నారు.

‘బీఆర్‌ఎస్ కృషితోనే స్టేషన్‌ఘన్‌పూర్ మున్సిపాలిటీ’

స్టేషన్‌ఘన్‌పూర్: గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో తాము చేసిన కృషి, గ్రామ పంచాయతీ తీర్మానాల వల్లే ప్రస్తుతం స్టేషన్‌ఘన్‌పూర్ మున్సిపాలిటీగా ఏర్పాటు జరిగిందని ఘన్‌పూర్ మాజీ సర్పంచ్, బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు తాటికొండ సురేష్‌కుమార్ అన్నారు. ఘన్‌పూర్ గ్రామ పంచాయతీ ఏర్పాటు కావడంపై హర్షం వ్యక్తం చేస్తూ స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం పారిశుద్ధ్య కార్మికులు, జీపీ సిబ్బందికి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు మాచర్ల గణేష్, నాయకులు కనకం గణేష్, మునిగెల రాజు, శంకర్, అశోక్, మల్లేష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్‌పై చర్య తీసుకోవాలి

జనగామ రూరల్: పట్టణంలో సుందరీకరణ కోసం నాణ్యతా లోపంతో డివైడర్ పనులు చేపట్టిన కాంట్రాక్టర్‌పై చర్య తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి అన్నారు. శనివారం ఆయన డివైడర్ పనులను పరిశీలించి మాట్లాడారు. నాసిరకంగా పనులు చేసిన సమయంలో విధులు నిర్వర్తించిన మున్సిపల్ అధికారులపై కూడా శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. పట్టణ కార్యదర్శి జోగు ప్రకాశ్, ఇర్రి అహల్య, బొట్ల శేఖర్, గోపి, విజేందర్, వెంటకమల్లయ్య, లింగం, లలిత, శ్రావణ్, ప్రశాంత్, శ్రీకాంత్, అంజమ్మ, శ్రీలత, కనకాచారి పాల్గొన్నారు.

అభినందనీయం

నర్మెట: శుభకార్యాలను పురస్కరించుకుని గ్రామస్తులు విద్యార్థులకు అతిథి భోజనాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని హెచ్‌ఎం దూడల రమేశ్ అన్నారు. హన్మంతాపూర్ ప్రాథమిక పాఠశాల 5వ తరగతి విద్యార్థిని ఇట్టిబోయిన యశస్విని పుట్టినరోజు పురస్కరించుకుని తండ్రి రాజు పాఠశాలతో పాటుగా అంగన్‌వాడీ సెంటర్లలో విద్యార్థులకు శనివారం చికెన్ బిర్యానీతో అతిథి భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ బంధుమిత్రుల స్థానంలో విద్యార్థులతో కలసి భోజనాలు చేయడం ఎంతో తృప్తినిచ్చిందని అన్నారు. అమ్మఆదర్శ కమిటీ చైర్‌పర్సన్ విశ్వనాథుల ఆశాలత, ఉపాధ్యాయులు, అంగన్ వాడీ టీచర్లు విద్యావతి, మమత, సంధ్య, ఐలమ్మ, అనిత, స్వప్న, విద్యార్థులు పాల్గొన్నారు.

చివరి ఆయకట్టు వరకూ సాగునీరు

● జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాంబాబు

రఘునాథపల్లి: ఎమ్మెల్యే కడియం శ్రీహరి కృషి ఫలితంగా సాగునీరు అందించే ప్రధాన కాల్వల మరమ్మతులకు రూ. 148 కోట్లు మంజూరు కావడంతో ఇక నియోజకవర్గంలో చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందనుందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారజోడు రాంబాబు అన్నారు. మండలంలోని బోయినిగూడెం నుంచి కంచనపల్లి మీదుగా నవాబుపేట రిజర్వాయర్‌కు వెళ్లే ప్రధాన కాల్వను శనివారం ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆదేశాల మేరకు పార్టీ మండల అధ్యక్షుడు కోళ్ల రవిగౌడ్ ఆధ్వర్యంలో రాంబాబు, జగదీశ్ చందర్‌రెడ్డి నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ కంచనపల్లి, కన్నాయపల్లి, గబ్బెట, కోడూరు, రామన్నగూడెం గ్రామాల్లోని 5 వేల ఎకరాలకు నీరు అందించే విధంగా కాల్వను పరిశీలించామన్నారు. లింగాజీ, నరేందర్, రవీందర్, శ్రావణ్‌కుమార్, లక్ష్మారెడ్డి, సోమాజి, వెంకన్న, అశోక్, అంజయ్య, పర్వీ పాల్గొన్నారు.



ప్రధాన కాల్వను పరిశీలిస్తున్న నాయకులు

సెమీ క్రిస్మస్ సంబురాలు



పాలకుర్తి: కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

జనగామ రూరల్/పాలకుర్తి/పాలకుర్తి టౌన్: జిల్లా వ్యాప్తంగా పలు పాఠశాలల్లో సెమీ క్రిస్మస్ సంబురాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన యేసు జననం, వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఆయా కార్యక్రమాల్లో పాఠశాలల డైరెక్టర్లు, ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. కాగా, పాలకుర్తి మండల కేంద్రంలో నిర్వహించిన మినీ క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి పాల్గొని కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో తొర్రూరు, పాలకుర్తి మార్కెట్ చైర్మన్లు, అధికారులు పాల్గొన్నారు. అలాగే కార్మెల్ కాన్వెంట్ హైస్కూల్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలను నిర్వహించిన అనంతరం నిరుపేదలకు నిత్యావసర సరుకులతోపాటు దుప్పట్లను పంపిణీ చేశారు.



సెయింట్ మేరీస్ పాఠశాలలో ప్రదర్శన ఇస్తున్న విద్యార్థులు



హైదరాబాద్ రోడ్డులోని సెయింట్ మేరీస్‌లో..



పాలకుర్తి టౌన్ కార్మెల్ కాన్వెంట్ హైస్కూల్‌లో దుప్పట్లు పంపిణీ చేస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్

సంక్షిప్త సమాచారం

పరామర్శ

కొడకండ్ల: బీఆర్‌ఎస్ మండల నాయకుడు పనస చంద్రమౌళి తండ్రి పాపయ్య మృతి చెందగా శనివారం ఆ పార్టీ మండల అధ్యక్షుడు సిందె రామోజీ ఆధ్వర్యంలో నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. పాపయ్య మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి సంతాపాన్ని తెలిపారు. పేరం రాము, అభిమన్‌గాంధీ, వెంకటేశ్వర్‌రావు, సతీష్‌గౌడ్, వీరస్వామి, ప్రభాకర్, వెంకటనారాయణ, హరీష్, శ్రీనివాస్ ఉన్నారు.

నియామకం

జఫర్‌గఢ్: ఉప్పుగల్లు గ్రామానికి చెందిన పెండ్యాల సమ్మయ్య సీపీఐ మండల ఇన్‌చార్జ్ కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ జిల్లా కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సీహెచ్ రాజారెడ్డి శనివారం ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సమ్మయ్య మాట్లాడుతూ రానున్న రోజు ల్లో పార్టీ బలోపేతంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటాలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

బియ్యం అందజేత

బచ్చన్నపేట: మండలంలోని పడమటికేశ్వాపూర్ గ్రామంలో గిద్దెల పోచమ్మ మృతి చెందింది. కాగా బాధిత కుటుంబ సభ్యులకు కాంగ్రెస్ నాయకుడు జంగిటి రమేశ్ శనివారం 25 కిలోల బియ్యాన్ని అందజేశారు. చల్ల సంతోష్‌రెడ్డి, నర్సింహ, సుధాకర్‌రెడ్డి, శివ, రవీందర్, కర్ణాకర్, నరేశ్ పాల్గొన్నారు.

సర్వేను వేగవంతం చేయాలి

బచ్చన్నపేట: మండలంలోని అన్ని గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను వేగవంతం చేయాలని ఎంపీడీఓ మల్లికార్జున్ సూచించారు. శనివారం మండలంలోని ఆలింపూర్ గ్రామంలో చేపట్టిన సర్వేను ఆయన పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. పంచాయతీ కార్యదర్శి రేవతి, కారోబార్ మురళి పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి సహకరించాలి

బచ్చన్నపేట: నారాయణపురం ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి దాతలు సహకరించాలని హెచ్‌ఎం ఇంద్రసేనారెడ్డి కోరారు. శనివారం ఆయన మాట్లాడుతూ పాఠశాలకు జీపీ కార్యదర్శి దేవీ ప్రసాద్, గుర్రాల మనోహర్‌రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయ బృందంతో కలిసి వాటర్ ఫిల్టర్‌ను ఏర్పాటు చేశారని తెలిపారు. సోషల్ టీచర్ శ్రీనివాసులు విద్యార్థులకు పెనులు, పెన్సిళ్లు అందించినట్లు చెప్పారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహారాష్ట్ర మంత్రిని కలిసిన దేవేందర్

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని మీదికొండకు చెందిన బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గాండ్ల దేవేందర్‌పటేల్ మహారాష్ట్ర మంత్రి ధర్మారావు బాబాను నాగపూర్‌లో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు. బీసీ సమస్యలపై ప్రత్యేక చొరవతో పనిచేయాలని ఆయన కోరారు.

విద్యార్థులకు డ్రెస్‌ల పంపిణీ



కొడకండ్ల: మండలంలోని ఏడునూతుల ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శనివారం హెచ్‌ఎం బుక్క ప్రవీణ్‌కుమార్ డ్రెస్సులు (ట్రాక్ సూట్స్) పంపిణీ చేశారు. హెచ్‌ఎం తన అన్న రవీందర్ జ్ఞాపకార్థం విద్యార్థులకు రూ. 40 వేల విలువ చేసే డ్రెస్సులను సొంతంగా అందజేశారు. ఉపాధ్యాయులు శివరాత్రి వెంకటేశ్వర్లు, రేణుక, శ్రీనివాస్, చైర్మన్ ఖాజాబీ పాల్గొన్నారు.

ద్వితీయ స్థానంలో నిలిచిన మండల కబడ్డీ జట్టు

తరిగొప్పుల: సీఎం కప్ టోర్నమెంట్‌లో భాగంగా జిల్లా కేంద్రంలోని ధర్మకంచ మినీ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో మండలానికి చెందిన కబడ్డీ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. కాగా, శనివారం ముగింపు వేడుకల్లో కబడ్డీ జట్టు సభ్యులు కలెక్టర్ రిజ్వాన్ పాషా చేతుల మీదుగా కప్‌ను అందుకున్నారు. క్రీడాకారులు శైలేందర్, లోకేష్, వినయ్, అనిల్ కుమార్, హరీష్, రిషికేష్, ఈశ్వర్, చందులను పీఈటీ బత్తుల మాధవి అభినందించారు.